హైదరాబాద్! కోట్లాది జీవులు ఎన్నో ఆశలతో, కోరికలతో కలలను నమ్ముకుంటే నిజం చేసే నగరం. ఏ వీధిలో నడిచినా ఎప్పుడూ ఒంటరితనం అనిపించని నగరం. గోల్కొండ గోడలు– ప్రతిధ్వనించే చరిత్ర, కన్నుల ముందున్న చార్మినార్– ఎన్నో ప్రేమ కథలకు పునాది.

ఇరానీ చాయ్ వేడి, గాలిలో పరిమళించే బిర్యానీ సువాసనతో జీవితం సుమధురమైపోతుంది. అలాంటి హైదరాబాద్ నగరంలోని ఒక అందమైన కుటుంబ కథ చదువుదామా మరి!.

******

# చాప్టర్ 1

## ప్రేమకథ కోసం ఒక అడుగు

హర్ష మాధవ్ అడపా, కీర్తి అడపా భార్యాభర్తలు.

ఒకరికొకరు అండగా నిలబడుతూ, సాధారణంగానే అయినా జీవితాన్ని ప్రేమతో కొనసాగించుకునే జంట. హర్షకు కుటుంబమే బలం. ఎవరికైనా కష్టం వస్తే ముందుగా నిలబడే మనసు అతనిది. మంచి భర్తగా, మంచి తండ్రిగా ఉండటమే తన జీవిత లక్ష్యంగా భావించే వ్యక్తి.

ఇక కీర్తికి కుటుంబమే ప్రపంచం. భర్త, కూతురుతో సమయం గడపడం, వాళ్ల అవసరాలు తీర్చడం దొరికే కాస్త ఖాళీ సమయంలో టీవీలో సీరియల్ చూడడం —— ఇదే తన నిత్య జీవితం.

ఆ ఇద్దరి మధ్య పెరిగిన కూతురు జోషిత అడపా.

చిలిపితనం, స్నేహానికి విలువ, కుటుంబం పట్ల అపారమైన ప్రేమ —— ఈ మూడు లక్షణాలు కలబోసిన ముచ్చటైన అమ్మాయి.

తల్లిదండ్రులు తనని చూసి గర్వించాలని, వాళ్ళ కళ్లకి తానో మంచి కూతురిగా కనిపించాలని కోరుకునే చిన్న ఆలోచనతో, పెద్ద కలలు కనే మనసు ఆమెది.

జోషిత, ఒక సాయంత్రం తండ్రి హర్ష దగ్గరకు వచ్చింది. ముఖంలో ఉత్సాహం ఉన్నా, కళ్లల్లో మాత్రం చెప్పలేని చిన్న బాధ దాగి ఉంది. కొద్దిగా ధైర్యం కూడగట్టుకుని మెల్లగా అంది——

"డాడీ, నాకు ఒక ప్రేమకథ చెప్పండి. వింటుంటే గుండె బరువెక్కేలా, మనసుకు హత్తుకునేలా ఉండాలి. ఎప్పటికీ మర్చిపోలేని అనుభూతిలా జీవితంపై ఆశ కలిగించేలానూ ఉండాలి."

ఆ మాటలు విన్న హర్ష ఆశ్చర్యంగా ఆమె వైపు చూసి నవ్వుతూ "అకస్మాత్తుగా మా ప్రేమ గురించి ఎందుకబ్బా? ఎవరినైనా ప్రేమిస్తున్నావా ఏమిటి?" అన్నాడు.

జోషిత చిరునవ్వుతో తల ఊపింది. "నా గురించి మీకు తెలియదా డాడీ? ప్రేమ, పెళ్ళిల మీద నాకు పెద్దగా నమ్మకం లేదు. ఈ రోజుల్లో ఎవరినైనా ప్రేమిస్తే జీవితకాలం తోడుగా ఉంటారో లేక మనసుకు గాయం చేసి మధ్యలో విడిచి వెళతారో ఎవరికీ తెలియదు." అని ప్రేమ పట్ల ఇష్టం లేనట్లు చెప్పింది.

"సరేలే, ఇలా అన్నవాళ్లే చివరికి పెళ్ళిళ్ళు చేసుకుని సంసార జీవితంలోకి అడుగుపెడతారు." హర్ష నవ్వుతూ ఆమెను ఆటపట్టించాడు.

ఆ మాటకి జోషిత పెదాలపై అమాయకమైన చిరునవ్వు విరిసింది. కానీ ఆ నవ్వు వెనుక, 'ఒక మంచి కథ రాయాలి' అన్న తపన, చెప్పలేని ఆలోచనలు కళ్ళలో కదలాడాయి.

అది గమనించిన హర్ష తన కూతుర్ని మృదువుగా అడిగాడు – "అయితే అకస్మాత్తుగా ప్రేమకథ గురించి ఎందుకు అడుగుతున్నావ్ తల్లీ?"

అప్పుడు జోషిత నెమ్మదిగా తన మనసులో ఉన్న వాస్తవాన్ని బయట పెట్టింది–

“డాడీ, మా కాలేజీలో కథల పోటీ జరుగుతోంది, నా స్నేహితులందరూ పాల్గొంటున్నారు. ఎవరి కథ పోటీలో గెలిస్తే, ఆ కథ పుస్తకంగా ప్రచురిస్తారట. నన్ను కూడా పాల్గొనమని ప్రోత్సహిస్తున్నారు. అందుకే నేను పోటీలో పాల్గొనాలని అనుకుంటున్నాను కానీ, ఎలాంటి కథ రాయాలి? ఎలాంటి కథ రాస్తే జనాలకి ఆసక్తి కలుగుతుందోనని ఆలోచించినప్పుడు, నాకు ఒక ప్రేమకథ రాయాలని అనిపించింది కానీ, ప్రేమ మీద నాకు నమ్మకం లేదు.”

హర్ష చిరునవ్వుతో ఆమె దగ్గరకి వచ్చి భుజంపై చెయ్యి వేసి “సరేలే తల్లీ.. దిగులు పడకు. నేను చెబుతాలే.” అన్నాడు.

ఆమె చెవిలో మెల్లగా “మరైతే, నాకూ మీ అమ్మకి మధ్య సాగిన ప్రేమకథ చెప్పనా?”

అప్పటివరకు కొంచెం నిరుత్సాహంగా ఉన్న జోషిత ముఖం ఆనందంతో విప్పారింది. “అయ్యో డాడీ, మీదో పెద్ద రోమియో – జులియట్ ప్రేమకథ మరి! మీది పెద్దలు కుదిర్చిన పెళ్ళే కదా. ఆ కథ వింటుంటే నాకే నిద్ర వచ్చేస్తుంది. నాకు ఈ పోటీలో మొదటి స్థానం రావాలి అనుకుంటున్నాను, చివరి నుంచి మొదటి స్థానం కాదు” అంటూ తండ్రి మీసాలని పట్టుకుని చిన్నగా లాగింది.

హర్ష నవ్వుతూ తన కూతురి నుదుటిపై ప్రేమగా ముద్దు పెట్టి “సరే సరే, నీకు మంచి ప్రేమ కథ చెబుతాను కానీ, రేపు చెబుతాను. అక్కడ డైనింగ్ టేబుల్ దగ్గర మీ అమ్మ ప్రెషర్ కుక్కర్లా బుస్సుబుస్సుమంటూ కోపం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే బాగా ఆలస్యం అయింది, మనం వెంటనే వెళ్లి తినకపోతే మనింట్లో వరల్డ్ వార్ మొదలవుతుంది.” సరదాగా అన్నాడు.

అలా నవ్వులు, సెటైర్లు, అమ్మ చీవాట్ల మధ్య ఆ కుటుంబం మరో రోజును ప్రేమతో ముగించింది. జోషితకి తన అమ్మానాన్నల ప్రేమ మాటల్లో కంటే వాళ్ళ దగ్గరితనంలోనే ఎక్కువగా కనిపించేది. కుటుంబం అనేది రక్త సంబంధంతో

మాత్రమే కాదు, ప్రేమాభిమానాలతో దృఢమయ్యే బంధం. మనిషి ఏ పనిమీద ఎంత దూరం వెళ్ళినా, తిరిగి చేరేది ప్రశాంతతనిచ్చే ఆ గూటికే.

"సరే, వెళ్ళి పడుకో ఆలస్యమైంది. గుడ్ నైట్." కూతురుతో అన్నాడు హర్ష.

ఆమె తన గదివైపు సాగింది.

ఆ రాత్రి ఆమె మనసులో రేపు తండ్రి చెప్పబోయే కథ, తన జీవితంలో ఏదో మార్పు తీసుకొస్తుందన్న బలమైన భావనకు బీజం వేసింది.

'అర్ధరాత్రి వరకు ఫోన్ చూస్తూ కూర్చోవద్దని, ఉదయం కాలేజీకి లేవడం కష్టమవుతుంద'ని హెచ్చరిస్తూన్న తల్లి అరుపులు ఇంట్లోని నిశ్శబ్దాన్ని ఒక్కసారిగా పటాపంచలు చేసాయి.

తల్లి అరుపులు తండ్రి చెవులు బద్దలయ్యేంత గట్టిగా ఉన్నాయంటూ ఉడికించింది. దానికి కీర్తి అక్కసుతో 'రేపు బ్రెడ్ ఆమ్లెట్ అడిగేటప్పుడు నీ సంగతి చూస్తానే' తర్జని ఊపుతూ బెదిరించింది.

ఈ మాటలన్నింటినీ పక్కనుండి వింటున్న హర్ష నవ్వుతూ తన భార్య దగ్గరకు వచ్చాడు. 'చిన్నపిల్లలా గొడవపడుతున్నా'వంటూ ఆమె చేతిని పట్టుకుని మెల్లగా తనవైపు లాక్కున్నాడు. ఆ ఒక్క స్పర్శతో తమ ఇరవై ఏళ్ల దాంపత్య జీవితంలోని మొదటిరోజు నాటి ప్రేమ, తమ మధ్య ఇంకా అలాగే పచ్చగా, ఆర్ద్రంగా ఉందని స్పష్టమైంది.

రాత్రి నిశ్శబ్దంగా కరిగిపోయి, ఉదయం చైతన్యవంతమైంది.

సూర్యుడు తన కిరణాలతో ప్రపంచాన్ని మేల్కొలిపాడు. పక్షుల కువకువలు, మనుషుల దినచర్యతో మరోరోజు మొదలైంది. దేవుడి గదిలో కీర్తి వాయిస్తున్న గంట శబ్దానికి, హర్ష బెడ్ మీద పొర్లుతూ "పొద్దున్నే పూజ మొదలైందీ" అనుకుంటూ మెల్లగా లేచాడు.

"దేవుడికి భజన పూర్తయితే నాకు కాఫీ ఇవ్వండి" చిలిపిగా నవ్వుతూ అన్నాడు.

కీర్తి కూడా నవ్వుతూ వంటగదిలోకి వెళ్ళింది

అప్పుడే గుమ్మం దగ్గర పేపర్ పడిన శబ్దం వినిపించింది. పేపర్ వేసి సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళి పోతున్న పేపర్ బాయ్ కి హర్ష చెయ్యూపుతూ శుభోదయం చెప్పాడు.

హర్ష పేపర్ తీసుకుని అరుగు మీద కూర్చొని వార్తలు చదవడం మొదలుపెట్టాడు.

అంతలో వంటగదిలోంచి కీర్తి విసుగ్గా "కాఫీ రెడీ" అంది.

"ప్రేమగా చెప్పొచ్చుకదా!" అంటూ హర్ష నవ్వుతూ వంటగదివైపు వెళ్ళాడు.

దానికి కీర్తి చమత్కారంగా "మన పెళ్ళై ఇరవై ఏళ్లు దాటింది కాబట్టి, ముచ్చట్లన్నీ అడుగంటాయి" అంది.

అప్పుడే హర్ష భార్యని వెనక నుంచి హత్తుకుని–"ప్రేమ ఎప్పుడూ పాతబడదు, నాలో శ్వాస ఉన్నంతవరకు అది కొనసాగుతుంది" అని కొండంత ప్రేమను మాటల్లో వ్యక్తపరచాడు.

భార్యాభర్తల ప్రేమ అలానే ఉంటుంది. **కాస్త వగరుగా, మరికాస్త తీయగా**.

సుఖదుఃఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలబడుతూ, ఒకరి బాధను మరొకరు తమదిగా భావిస్తూ.. చిన్న చిన్న సంతోషాలతోనే జీవితాన్ని ఆనందమయం చేసుకునే బంధం, ప్రతి జంట జీవితంలో ఉండి తీరాలి.

అంతలో కీర్తి నవ్వుతూ గుర్తు చేసింది ——

"ముందు మీ కూతుర్ని లేపండి లేదంటే కాలేజీకి ఆలస్యం అవుతుంది."

హర్ష వెంటనే జోషిత గదిలోకి వెళ్లాడు. బెడ్షీట్ చుట్టుకుని ముద్దుగా నిద్రపోతున్న కూతుర్ని చూసి నవ్వుకున్నాడు. 'అమ్మ మన పైన చూపించే రుసరుసలతో దోసెలు కూడా మాడిపోతాయ'ని బెదిరింపులు చేస్తూ, తండ్రి ప్రేమతో ఆమెను మెల్లగా నిద్ర లేపడం మొదలుపెట్టాడు.

తండ్రి మాటలతో జోషిత పెదాలపై చిన్న చిరునవ్వు అప్పుడే మొగ్గ విచ్చుకున్నట్టుగా విరిసింది.

"గుడ్ మోర్నింగ్ డాడీ," అంటూ నిద్రమత్తును విదిలించింది.

హర్ష ఆమె తల అభిమానంగా నిమురుతూ 'లేచి రెడీ అవ్వమ'ని చెప్పి, తనూ ఫ్రెష్ అవడానికి వెళ్ళిపోయాడు.

ప్రతి తండ్రి తన కూతురిలో ఒక దేవతను చూసుకుంటాడు. తన ఇంట్లో లక్ష్మీదేవి అడుగుపెట్టినట్టే భావిస్తాడు. కూతురి కోసం ప్రపంచంతోనైనా పోరాడగల శక్తి అతనికి వస్తుంది. తండ్రి కూతుళ్ల బంధం ఎంత చెప్పినా తరగనంత విస్తృతమైనది.

కొద్దిసేపటికి జోషిత కూడా రెడీ అయి హాల్లోకి వచ్చింది. డైనింగ్ టేబుల్ ఉన్నా, టీవీ ముందు నేలపై బాసింపట్టు వేసుకుని కూర్చొని, ప్లేట్లు చేతిలో పట్టుకుని టిఫిన్ తింటూ టీ.వీ.లో కార్టూన్ సీరియల్ చూస్తున్న తండ్రీకూతుళ్ళను కీర్తి కాసేపు అక్కడే నిలబడి చూసింది.

ఆ దృశ్యం ఆమెలో ఆనందాన్ని కలిగించగా, కొంచెం చిరాకునూ మేళవించింది. వంటింటిలో పని చేస్తూ నడుచుకుంటూ వచ్చిన ఆమె ముఖంపై ఎండ వెలుగులో మెరిసే చెమట చుక్కలు, ఆమె పడుతూన్న కష్టాన్ని చెప్పకనే చెబుతున్నాయి. ఆమె కాస్త కోపంతో "డైనింగ్ టేబుల్ ఎందుకు కొనుక్కున్నామో అర్థం కావడం లేదు, నేల మీదే టీవీ ముందు కూర్చుంటే సరిపోతుంది కదా!" అని రుసరుసలాడింది.

హర్ష చిలిపిగా "సరేలే తల్లీ, ఇవాళ కాస్త ఎక్స్ ట్రాగా ఎంజాయ్ చేస్తున్నాం. బీపీ తగ్గించుకో. పొద్దుపొద్దున్నే యుద్ధం స్టార్ట్ చేయొద్దు ప్లీజ్." అంటూ భార్యను శాంతింపజేశాడు.

కీర్తి వంటింట్లో ఒక్కొక్క దోశా వేసి తెస్తూ, వేడివేడిగా వాళ్ళ ప్లేట్లో వడ్డిస్తోంది. దోశ తింటూ జోషిత ఏదో గుర్తొచ్చినట్టుగా తండ్రిని చూసి "డాడీ, నిన్న నేను అడిగిన విషయం మీకు గుర్తుందా?." అడిగింది.

హర్ష కాస్త ఆలోచిస్తున్నట్టుగా నటిస్తూ "ఏ విషయం అమ్మా?" అడిగాడు.

అది విన్న జోషిత తనకు కలిగిన చిరాకును మాటల్లో కాకుండా దోశ మీద చూపించింది. ప్లేట్లో ఉన్న దోశని చిన్న చిన్న ముక్కలుగా విరుస్తూ విసురుగా తినసాగింది.

ఆ దృశ్యం చూసిన హర్ష నవ్వకుండా ఉండలేకపోయాడు.

"అరే బంగారం గుర్తుందిలే! ఊరికే నిన్ను ఆటపట్టించాను అంతే" అని చెప్పి ఆమె తలను నిమిరాడు.

ఆ మాట విన్న జోషిత కళ్ళు మెరిశాయి.

"అయితే ఎప్పుడు చెప్తారు?." అన్నట్టు ఆసక్తిగా చూసింది.

"ఈరోజు సాయంకాలం నీ కాలేజ్ అయిపోయాక, నేను కూడా ఆఫీస్ నుంచి త్వరగా వస్తాను అప్పుడు కూర్చుని ప్రశాంతంగా చెప్తాను," అన్నాడు.

"సరిపోయింది మీ తండ్రీకూతుళ్ళకి, ఏంటో ఆ కథల పోటీలు! ముందు నా దోశలు తినడం కంప్లీట్ చేయండి. ఆ తర్వాత మీ కబుర్లు కొనసాగించండి." అని వంటగది నుంచి హాల్లోకి వినిపించేటట్లు అరుస్తూ చెప్పింది కీర్తి.

"సరేలే తల్లీ, తింటున్నాం!" అని ఇద్దరూ ఒకేసారి చెప్పారు.

కీర్తి ముందే రెడీ చేసి పెట్టిన లంచ్ బాక్సులు తీసుకుని, ఎవరి దారిన వాళ్ళు బయలుదేరారు.

వాళ్ళు గుమ్మం దాటగానే కీర్తి గాఢంగా ఊపిరి తీసుకుంది. "హమ్మయ్య ఇద్దరూ వెళ్ళిపోయారు. నా పనులు త్వరగా ముగించుకుని స్టార్ మహిళ ఎపిసోడ్ చూడాలి." అనుకుంటూ తన పనుల్లో నిమగ్నమయింది.

ఇంట్లో ప్రతి తల్లికీ, అమ్మమ్మకీ, నానమ్మకీ '**స్టార్ మహిళ**' అనే ప్రోగ్రాం ఒక ఎమోషన్. ఎంత పని ఉన్నా, ఎంత అలసిపోయినా ఆ అరగంట మాత్రం వాళ్ళకు తమకోసమంటూ దొరికిన ఆనందాన్నిచ్చే చిన్న ప్రపంచం అది.

పెద్ద ఇల్లు, కోట్ల డబ్బులు అవసరం లేదు. గుప్పెడు ప్రేమ, కాస్త ప్రశాంతత చాలు ఆడవాళ్ళ జీవితం ఆనందమయంకావడానికి.

సాయంకాలం చీకటిగా మారుతున్నప్పుడు జోషిత, హర్ష ఇద్దరూ వాళ్ళ వాళ్ళ పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్నారు. అప్పటికే కీర్తి వాళ్ళ కోసం డిన్నర్ కూడా రెడీ చేసి ఉంచింది. ఫ్రెష్ అయి ముగ్గురూ కలిసి భోజనం ముగించారు.

రేపటికి బ్రేక్ఫాస్ట్ ఏమి చేయాలి అని మనసులో ప్లాన్ చేసుకుంటూ "సరే నేను వెళ్ళి పడుకుంటాను. మీ తండ్రీకూతుర్లు అర్ధరాత్రి వరకు కబుర్లు చెప్పుకుని ఎప్పుడొస్తారో మీ ఇష్టం." అని ప్రతి తల్లి లాగానే మాటల్లో తన ప్రేమ వ్యక్తమవకుండా విసుక్కుంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది కీర్తి.

ఆ తర్వాత హర్ష, జోషిత ఇద్దరూ మేడపైకి నడవడానికి వెళ్లారు. రాత్రి వెన్నెల కురిపిస్తూ ప్రశాంతంగా ఉంది. జోషిత కాస్త ఉత్సాహంగా–

"డాడీ, ఇప్పుడు కథ చెప్పండి. నేను స్క్రిప్ట్ రెడీ చేసుకోవాలి కదా." అంది.

హర్ష కూతురు భుజం మీద చెయ్యి వేసి నడుస్తూ ఇలా అన్నాడు "ఇది కేవలం కథ కాదు బంగారం, నా స్నేహితుల గొప్ప ప్రేమ కథ. ఎప్పటికీ నా గుండెల్లో దాగుండే కథ."

ఆ మాటలతోనే జోషితకు అర్థమైంది. అది సాధారణ ప్రేమకథ కాదని తన తండ్రి గుండెల్లో తడి తడిగా ఉన్న ఒక మధుర జ్ఞాపకమని.

జోషిత కొంచెం ఆసక్తిగా తండ్రి వైపు చూసి "సరే గానీ, ఎవరిది ఈ ప్రేమకథ?" అని అడిగింది.

దానికి హర్ష చిన్న నవ్వుతో, కాస్త గర్వంగా "ఇది నా స్నేహితుల గొప్ప ప్రేమకథ." అన్నాడు.

"అబ్బో! గొప్ప కథో కాదో నేను విన్నాక చెప్తాగాని. ముందు అంత బిల్డప్ కొట్టకు, కథ చెప్పు." అంది.


హర్ష నవ్వుతూ కూతురి తలపై మెల్లగా మొట్టి "సరే, కథ విన్నాక నువ్వే చెప్తావులే, ఎలాంటి ప్రేమకథో." అన్నాడు.

ఆ తరువాత అతని స్వరం కాస్త మారింది, గతంలోకి జారుకుంటూ "ఈ ప్రేమకథ మేము చదువుకున్న కాలేజీలో పుట్టింది." అంటూ మెల్లగా ప్రారంభించాడు. అతని మాటల్లో మధురమైన నోస్టాల్జియా దాగి ఉంది.

"విశాఖ. పేరులోనే ఒక అద్భుతం. ఆ సిటీని చూసిన ప్రతిసారి మనసు పురి విప్పిన మయూరమవుతుంది. అందుకేనేమో వైజాగ్ని సిటీ ఆఫ్ లవ్, సిటీ ఆఫ్ డెస్టినీ అంటారు. ఈ కథ మొదట వికసించిన చోటు కూడా అదే." అని చెప్పాడు.

అది విన్న జోషిత నవ్వుతూ తండ్రి బుగ్గలను ప్రేమగా గిల్లి "అబ్బో, కవిత్వం కూడా బాగానే చెప్తున్నావే." అంది.

హర్ష కూడా నవ్వుతూ కూతురి కళ్ళల్లోకి చూస్తూ "ఏదోలే, నీకది గొప్పకథ కాకపోయినా నాకు మాత్రం గొప్పకథే. అలా పుట్టుకొస్తూ ఉంటాయి కొన్ని కథలు" అన్నాడు.



"సరే! ఆ కాలేజీలో కథ ఎలా మొదలైంది? వాళ్ళ పేర్లు ఏంటి? చెప్పు" అని జోషిత ఆత్రుతగా అడిగింది.

హర్ష క్షణం ఆగి ఎంతో ఆప్యాయంగా "వాళ్ళ పేర్లు **రుక్మిణి, కృష్ణ**. వీళ్ల ప్రేమకథే నేను నీకు చెప్పబోయే కథ. వాళ్లే నా ప్రాణ స్నేహితులు." అన్నాడు.

ఆ మాట విన్న జోషిత ఒక్కసారిగా ఆశ్చర్యపోయి "ఓహో! నీ ప్రాణ స్నేహితులా! అలా అయితే నేను పుట్టినప్పటి నుంచి ఒక్కసారి కూడా వాళ్ళు మన ఇంటికి రావడం గానీ, నువ్వు వాళ్ళని కలవడం గానీ ఎందుకు జరగలేదు?." అని అడిగింది.

హర్ష కూతురి తలపై చెయ్యి వేసి భావోద్వేగంతో "అది కూడా ఈ కథలో భాగమే బంగారం." అన్నాడు.

**"సరే, కథా ప్రారంభం చేస్తున్నాను, జాగ్రత్తగా విను."** అన్నాడు హర్ష.

దానికి జోషిత చమత్కారంగా **"కథ మొదలెట్టు బాబూ త్వరగా."** అంది.

****

హర్ష నవ్వుకుంటూ తన జ్ఞాపకాలలోకి జారిపోయాడు.

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత విశాఖలోని ఒక ఇంజినీరింగ్ కాలేజీలో చేరిన రోజులు అతని కళ్ళముందు కదలాడాయి.

అంతవరకు హాస్టల్ ఉంటూ చదువుకున్న తను స్కూల్లో చేసిన అల్లర్లు, చిన్న చిన్న సరదాలు మసకబారిపోయి, అల్లరి చేసే పిల్లాడి నుంచి, మెచ్యూరిటీ దశలోకి చేరుతున్న కుర్రాడిగా పరిణామం చెందుతున్నట్టు అనిపించేది. అయితే విశాఖలోని ఇంజినీరింగ్ కాలేజీలో అడుగుపెట్టిన క్షణం నుంచి మళ్ళీ తనకి రెక్కలు వచ్చినట్టుగా అనిపించింది. ప్రపంచాన్ని కొత్తగా చూస్తున్నట్టు, జీవితాన్ని కొత్తగా మొదలుపెడుతున్నట్టుండే ఒక అపూర్వమైన ఉత్సాహం మనసంతా నిండిపోయింది. ఏదో చేయాలి, మరేదో సాధించాలి అన్న గొప్ప ఆశ, ఆశయాలతో ప్రారంభమైన ప్రయాణం అది.

తన పాత జ్ఞాపకాల్లో తారట్లాడుతూ, ముఖం మీద ఎప్పుడూ కనిపించని ఒక వెలుగుతో కూడిన నవ్వు మెరిసిపోతుండటాన్ని గమనించిన జోషిత ఆశ్చర్యంగా తండ్రి వైపు చూసింది.

కాస్త భావోద్వేగంతో **"డాడీ, ఇన్ని సంవత్సరాలలో నేను మీ ముఖంలో ఇలాంటి చిరునవ్వు ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు చూసినందుకు చాలా ఆనందంగా ఉంది."** అంది. ఆ వెంటనే ఆతృతతో **"సరే! తర్వాత ఏమైంది?"** అడిగింది.

హర్ష కొంచెం గాఢంగా శ్వాస తీసుకుని **"మన కాలేజ్ లైఫ్ ఎంత కావాలనుకున్నా మళ్ళీ తిరిగి రాదు, మనం పోగుచేసుకున్న జ్ఞాపకాలు తప్ప. ఎన్నో కొత్త పరిచయాలు, కొత్త అనుభవాలు. కొంతమంది చుట్టాల్లా వచ్చి వెళ్ళి పోతారు– ఇంకొంతమంది మన నీడలాగా మన పక్కనే ఉండిపోతారు,"** చెప్పాడు.

"ఇంజినీరింగ్ కాలేజీలో అది నా మొదటి రోజు. దాదాపు ఎనభై ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న మా కాలేజీని చూసినప్పుడు నాకు రెండు కళ్ళు చాలలేదు, నేనేదో కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్టుగా అనిపించింది. కొత్తగా చేరిన స్టూడెంట్స్ అంతా గుంపులు గుంపులుగా నిలబడి ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ, చిరునవ్వులతో, చిన్న చిన్న మాటలతో కొత్త స్నేహాలకు బీజం వేస్తున్నారు. ఎక్కడ చూసినా కొత్త ముఖాలు, కొత్త ఆశలు, కొత్త కలలతో నిండిన కళ్ళు.

ఆ సందడి, ఆ ఉత్సాహం నా చెవుల్లో సందడి చేస్తుండగా, నా గుండెల్లో మాత్రం తెలియని ఆనందం కలుగుతూ 'ఇక్కడే నా కొత్త కథ మొదలవుతుందేమో' అన్న భావన మెల్లగా రూపుదిద్దుకుంటోంది.

చుట్టూ కొత్త ముఖాలు, కొత్త పేర్లు **"మై నేమ్ ఈజ్ హారిక."**

**"హాయ్, మై నేమ్ ఇస్ రామ్"** అంటూ ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ అందరూ ఉత్సాహంగా మాట్లాడుకుంటున్నారు.